సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం : 6 : జూన్ : 2023



నిక్షయమిత్ర కిట్లు పంపిణీ

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం టీబీ వ్యాధిగ్రస్తులకు నిక్షయ మిత్ర న్యూట్రీషియన్ కిట్లను పంపిణీ చేశారు.



డిగ్రీ కళాశాలలో చేరండి

వేములవాడఅర్బన్: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు చందుర్తి మండలం మల్యాల, లింగంపేటల్లో ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.0/29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని ఎంపీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం బడిబాట నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం గల ఉపాధ్యాయులు బోధిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడే చేర్పించాలని కోరారు. హెచ్‌ఎం గాజెంగి విస్సు, జిల్లా సైన్స్ ఆఫీసర్ పాముల దేవయ్య, టీఆర్‌టీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణప్రసాద్ గౌడ్, కౌన్సిలర్ ఒగ్గు ఉమ, ఎస్‌ఎంసీ చైర్మన్ గూడెల్లి లత, ఉపాధ్యాయులు రమేశ్, పద్మారెడ్డి, వెంకటేశ్వర్లు, శైలజ, శ్రీలత ఉన్నారు.

కొనుగోళ్లలో జాప్యంపై కాంగ్రెస్ నిరసన



బోయినపల్లి(చొప్పదండి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నాయకులు మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమైనా కేంద్రాల్లో ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదన్నారు. ఈమేరకు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు పులి లక్ష్మీపతి, అనుముల హరికృష్ణ, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, బోయిని ఎల్లేశ్, ఏనుగుల కనకయ్య, నాగుల వంశీ పాల్గొన్నారు.

మా ఊరికి బస్సు నడపండి



వేములవాడరూరల్: తమ గ్రామానికి బస్సు నడపాలని కోరుతూ వేములవాడరూరల్ మండలం నూకలమర్రి గ్రామస్తులు సోమవారం సర్పంచ్ పెండ్యాల తిరుపతి ఆధ్వర్యంలో డిపో మేనేజర్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. వేములవాడ నుంచి నూకలమర్రి, వట్టెంల, తిమ్మాపూర్ గ్రామాలకు అనుబంధంగా ఉన్న నూకలమర్రి మీదుగా బస్సు నడిపించాలని కోరారు. దీనికి డీఎం సానుకూలంగా స్పందించి, హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. గ్రామస్తులు రాములు, గంగయ్య, తిరుపతి, జనార్దన్, మాజీ వైస్ ఎంపీపీ దొంతుల అంజనీకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పెండ్యాల శంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ దేవరాజు, బాబు ఉన్నారు.

టెక్స్‌టైల్‌పార్క్ బంద్ విజయవంతం చేయండి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): యారన్ సబ్సిడీ జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 7న చేపట్టే టెక్స్‌టైల్‌పార్క్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్‌పార్క్‌లో సోమవారం మాట్లాడారు. చీరలకు సంబంధించి 10 శాతం యారన్ సబ్సిడీ అందించాలని, వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలని కోరారు. బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. అక్కల శ్రీనివాస్, జెల్ల సదానందం, ఆడెపు శుభశేఖర్, రవి, రాజమల్లు, వేణు, శ్రీనివాస్, ఆంజనేయులు, రమేశ్, మహేశ్, అశోక్, రాజేశం పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పారిశ్రామిక ఉత్సవం

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో మంగళవారం పారిశ్రామిక ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ సోమవారం తెలిపారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో పారిశ్రామిక ఉత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, కొత్తగా పరిశ్రమలు స్థాపించిన యువకులు హాజరుకావాలని కోరారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి దంపతులకు ప్రసాదం అందజేస్తున్న అధికారులు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

రాజన్నకు జనజాతర

వేములవాడ: దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న సన్నిధి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు, కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పాలప్యాకెట్లు అందించారు. ఆలయ అధికారులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని బద్దిపోచమ్మ వీధి, భీమేశ్వరాలయం వీధి, వీఐపీ రోడ్డు ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు ప్రసాదాలు అందించారు. పీఏసీఎస్ చైర్మన్లు ఏనుగు తిరుపతిరెడ్డి, బండ నర్సయ్యయాదవ్, కిషన్‌రెడ్డి, సంకినేని రామ్మోహన్‌రావు, ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు ఉన్నారు. రాజన్న దర్శనానికి సోమవారం వీఐపీల రాక పెరిగింది. వీఐపీల ద్వారా లెటర్లు తెచ్చుకున్న వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో పీఆర్‌వో కార్యాలయం అధికారులు కాసేపు వారిని కూర్చోబెట్టడంతో ఆఫీస్ ముందు ఎదురుచూశారు. వీఐపీల రాకపెరగడంతో సామన్య భక్తులు ఇబ్బందులు పడ్డారు.

ఎక్కడి వడ్లు అక్కడే..

- తూకం లేదు.. తరలింపు లేదు
- రైస్‌మిల్లుల్లో నిండిన ధాన్యం
- పొరుగు జిల్లాలకు వెళ్లని వడ్లు
- పెద్దపల్లి జిల్లాకు కేటాయింపులపై ఆశలు
- పట్టించుకోని పౌరసరఫరాల ఉన్నతాధికారులు



వడ్ల కుప్ప వద్ద దండం పెడుతున్న ఈ ముగ్గురు రైతులు దొబ్బల దుర్గయ్య, వేముండ్ల ముత్తయ్య, చక్రాల మధు. కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన వీరు 25 రోజుల కిందటే వడ్లను తూర్పారబట్టి తూకం వేసేందుకు సిద్ధం చేశారు. లారీలు రాకపోవడంతో తూకం వేయడం లేదు. లారీలను పంపించాలని మూడు రోజుల కిందట కోనరావుపేటలో ధర్నా సైతం చేశారు. రోజు ఓ లారీని పంపుతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు లారీలు రాలేదు. వడ్లు తూకం వేయలేదు.



పెద్దూరులో తూకం వేయని ధాన్యం కుప్పలు



బస్తాల వద్ద ఉన్న ఈ రైతు ద్యావల వినోద్. రుద్రంగికి చెందిన వినోద్ నెల కిందట వరి కోసి, వడ్లను ఆరబోశాడు. మధ్యలో వర్షం పడి వడ్లు తడిసినా మళ్లీ ఆరబోశాడు. పది రోజుల కిందట తూకం వేయించినప్పటికీ లారీలు రాక మిల్లుకు తరలించలేదు. ఇటీవల మరోసారి వర్షం పడడంతో వడ్ల బస్తాలను తిర్లమర్ల బొర్లించాడు. అయినా లారీ రాలేదు.

సిరిసిల్ల: పంటలు పండించేందుకు అష్టకష్టాలు పడ్డ రైతన్నలకు ధాన్యం అమ్మడం తలకుమించిన భారంగా మారింది. నెల రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే పడిగాపులు కాస్తున్నా తూకం వేయడం లేదు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిద్దామంటే లారీలు రావడం లేదు. ఒక వేళ మిల్లుకు పోయిన అన్‌లోడింగ్ కావడం లేదు. ఫలితంగా జిల్లాలో వారం రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. జిల్లాలో 30 పారాబాయిల్డ్ రైస్‌మిల్లులు ఉండగా.. వడ్ల కేటాయింపులు కూడా పూర్తయ్యాయి. 78 రా రైస్‌మిల్లులకూ ధాన్యం కేటాయించారు. జిల్లాలో వడ్ల నిల్వకు స్థలం లేకపోవడంతో కామారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లోని రైస్‌మిల్లులకు కేటాయించారు. అక్కడికి పొరుగు ఖమ్మం, మెదక్ జిల్లాల ధాన్యం లారీలు వస్తున్నాయి. ఖమ్మం జిల్లా నుంచి 45 కిలోల భర్తీతో రావడంతో ఆ వడ్లను మిలర్లు దింపుకుంటున్నారు. మన జిల్లా బస్తాల్లో 42 కిలోలు ఉండడంతో మిల్లర్లు దింపుకోవడం లేదు.

పెద్దపల్లికి కేటాయిస్తే మోక్షం

పెద్దపల్లి జిల్లాలో 150 వరకు బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉండగా.. ఆ జిల్లాకు రాజన్నసిరిసిల్ల జిల్లా వడ్లను తరలించేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. పెద్దపల్లికి కేటాయిస్తే పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ముగుస్తాయి. కానీ ఆ చొరవ చూపకుండా పౌరసరఫరాల రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సాగడం లేదు. మరోవైపు వర్షాకాలం సమీపించడంతో రైతులు వడ్లు తడుస్తాయని ఆందోళన చెందుతున్నారు. పెద్దపల్లి జిల్లాకు వడ్లు తరలించేందుకు అనుమతి ఇవ్వాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

పంట కోసి నెల అయింది



పంటకోసి నెల గడుస్తోంది. లారీలు రావడం లేదు. వడ్లను జోకుత లేరు. రేపు, మాపు అంటూ పది రోజుల సంది జరుపుతుండ్రు. బస్తాకు రూ.2 చొప్పున లారీలకు వసూలు చేస్తుండ్రు. వానా కాలం వర్షాలు మొదలవుతున్నాయి.

– పంగ రామస్వామి, బోనాల

వడ్లు ఎప్పుడు కొంటారో.. ఏమో ?



వరి కోసి నెలదాటింది. వడ్లు ఎప్పుడు కొంటారో ఏమో తెలుస్తలేదు. లారీలు వస్తలేవు అంటుండ్రు. వడ్లను మాత్రం జోకుతలేరు. వానాకాలం వచ్చింది. వడ్ల కాడనే ఉంటే వ్యవసాయం పనులు చేసుడయిత లేదు.

– బామండ్ల తిరుపతి, నర్సింహపల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం



జిల్లాలో వడ్ల కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. సాధ్యమైనంత మేరకు వడ్ల కొనుగోళ్లు, ధాన్యం రవాణా చేస్తున్నాం. కొనుగోళ్లు చివరికి వచ్చాయి. రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తాం.

– ఎస్.జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో, రాజన్న సిరిసిల్ల

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల తీరిది..

కొనుగోలు కేంద్రాలు	: 258
మూసివేసిన కొనుగోలు కేంద్రాలు	: 53
ఇప్పటి వరకు కొన్న ధాన్యం	: 2,03,591.600 మెట్రిక్ టన్నులు
తరలించిన ధాన్యం	: 1,92,561.590 మెట్రిక్ టన్నులు
కేంద్రాల్లో నిల్వ ఉన్న బస్తాలు	: 11030.010 మెట్రిక్ టన్నులు
వడ్లను అమ్మిన రైతులు	: 33,533
కొనుగోలు చేసిన వడ్ల విలువ	: రూ.419.39 కోట్లు
డబ్బులు పొందిన రైతులు	: 13,243 మంది
రైతుల ఖాతాల్లో జమయిన మొత్తం	: రూ.161.25 కోట్లు

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్లటౌన్: మానవ తప్పిదాలతో పాడవుతున్న పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం జిల్లా న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, న్యాయసేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్, ఏజీపీ రవీందర్‌రావు ఉన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఏది?



గుడి చెరువులో మురికినీరు చేరుతున్న ప్రాంతాన్ని చూపిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: చెరువును పూడ్చిన నాయకులు.. వేములవాడలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఎందుకు నిర్మించలేదని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. రాజన్న గుడిచెరువులోకి గోదావరి జలాలు తెచ్చామని చెబుతున్న పాలకులకు ఇటుగా పారుతున్న మురికినీరు కనిపించడం లేదా.. అని నిలదీశారు. వేములవాడ రాజన్నగుడి చెరువులోకి వచ్చే మురికినీటి కాలువ వద్ద సోమవారం నిరసన తెలిపారు. గుడిచెరువు ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోందని, చేపలు చనిపోతున్నాయని గంగపుత్రులు మొత్తుకుంటున్నారన్నారు. ఆలయం, పట్టణాభివృద్ధికి ఏర్పడిన వీటీడీఏ.. జీతాలు పొందేందుకు తప్ప పనిచేయడం లేదని విమర్శించారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు ఏవని అడిగారు. కూరగాయల కొమురయ్య, చిలుక రమేశ్, సాగారం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, కనికరపు రాకేశ్, మెండె రాజు, వస్తాద్ కృష్ణ, గణేశ్, తోట లహరి, కూర దేవయ్య, సాబీర్ పాల్గొన్నారు.

సమస్యలు ఆలకించండి

- ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- వివిధ సమస్యలపై 29 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతిని వేడుకున్నారు. దరఖాస్తుదారుల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. ప్రజావాణికి మొత్తం 29 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్వో శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

స్వచ్ఛమైన పుర‘పాలన’కు అవార్డు

- వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు దక్కిన పురస్కారం
- అవార్డు అందుకున్న సిరిసిల్ల కమిషనర్ సమ్మయ్య



అవార్డు అందుకుంటున్న కమిషనర్ సమ్మయ్య

సిరిసిల్లటౌన్: స్వచ్ఛమైన పురపాలన’కు మరో అవార్డు వరించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు నిర్వహించిన పోటీలలో సిరిసిల్ల పురపాలక సంఘానికి ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు గెలుచుకుంది. సోమవారం హైదరాబాద్‌లోని పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అవార్డు అందుకున్నారు. మంత్రులు శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్‌రెడ్డి పురస్కారాన్ని అందజేశారు.

వెలుగుల ప్రగతి సాధించాం

- విద్యుత్ వినియోగంలో దేశంలోనే అగ్రస్థానం
- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల: నిత్యం కరెంట్ కోతల నుంచి నిరంతరం వెలుగుల ప్రగతిని సాధించామని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ ప్రగతిపై సమావేశం నిర్వహించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయం సహా అన్ని రంగాలకు 24 గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ ఘనత అని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో విద్యుత్ రంగం నిర్లక్ష్యానికి గురైందని, స్వరాష్ట్రంలో అనేక కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్మించి ఎంతో పురోగతి సాధించామన్నారు. ప్రస్తుతం మిగులు విద్యుత్ రాష్ట్రం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. కొత్త సబ్‌స్టేషన్లు, కొత్తలైన్లు నిర్మించడంతో రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 2,140 యూనిట్లకు చేరిందని, ఇది జాతీయ సగటు (1,255) కంటే 70 శాతం అధికమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత కొత్తగా 8.46 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, 27.49 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మాట్లాడుతూ సెస్ పరిధిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ అనురాగ్ జయంతి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, సెస్ ఎండీ రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై డాక్యుమెంటరీ ప్రదర్శన

ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిపై డాక్యుమెంటరీని ప్రదర్శించారు. సెస్ పరిధిలో విద్యుత్ ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు ఆర్థికసాయం చెక్కులను పంపిణీ చేశారు.

మున్సిపల్ కార్మికులతో ఎస్పీ సహపంక్తి భోజనం

సిరిసిల్లక్రైం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని కొత్తచెరువు వద్ద మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులతో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. వంద మంది కార్మికులతో కలిసి ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీసు అధికారులు భోజనం చేశారు. పోలీసులు, పారిశుధ్యకార్మికులు, వైద్యసిబ్బంది కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించారని ఎస్పీ కొనియాడారు. పోలీసులు నేరాలు లేకుండా సమాజాన్ని శుభ్రం చేస్తే.. పారిశుధ్య కార్మికులు చెత్తాచెదారం లేని సమాజం కోసం శ్రమిస్తారన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు అనిల్‌కుమార్, ఉపేందర్, ఎస్సైలు, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

క్లుప్తంగా

సీఎం కేసీఆర్‌ను కలిసిన గోలిమోహన్



సీఎం కేసీఆర్‌తో గోలి మోహన్

వేములవాడ : హైదరాబాద్‌లో సోమవారం జరిగిన భారత్ భవన్ భూమిపూజ కార్యక్రమంలో భాగంగా సీఎం కేసీఆర్‌ను వేములవాడకు చెందిన డాక్టర్ మోహన్‌గోలి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు మోహన్ తెలిపారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో డాక్టర్ మోహన్ గోలి సీఎం కేసీఆర్‌ను కలుసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

'గురుకుల' ప్రవేశానికి అర్హత



సర్టిఫికెట్లతో విద్యార్థులు

చందుర్తి : మండలంలోని కిష్టంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 12 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశానికి అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ చిగుర్ల మల్లేశం తెలిపారు. పాఠశాలలోని 16 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకాగా 12 మంది అర్హత సాధించారన్నారు. సర్పంచ్ అంబిరి కలన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని, ఎస్ఎంసీ చైర్మన్ మల్లేశం, అర్హత సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఆయుధం కోసం దరఖాస్తులు ?

వేములవాడ: తమకు ఆయుధం కావాలంటూ వేములవాడ ప్రాంతానికి చెందిన చాలామంది పోలీసులకు, జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో అధికార పార్టీ నేతలు ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఇటీవల వేములవాడలో తుపాకీ క్రేజీ పెరిగినట్లు నాయకులు చర్చించుకుంటున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న బాల్యమిత్రులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన గడ్డం ప్రకాశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మిత్రుడి కుటుంబానికి సోమవారం గ్రామానికి చెందిన పొన్నాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పెద్దబడి మిత్రమండలి (పదో తరగతి పూర్వ విద్యార్థులు) రూ.10వేల నగదుతో పాటు 50కిలోల బియ్యం అందజేశారు. ఇక్కడ కమిటీ అధ్యక్షుడు పూజం భూమరాజు, సభ్యులు పొన్నాల తిరుపతి రెడ్డి, రమేశ్, రాంచందర్, శ్రీనివాస్, రామచంద్రం, బుర్క బాబ్జీ, వెంకట్‌రెడ్డి, జాఫర్, రఘురాములు, శ్రీశైలం, రమేశ్‌రావు, హాజీబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్షణాల్లో ఘోరం.. అమ్మతనానికి దూరం

- ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లి వస్తుండగా ప్రమాదం
- స్కూటీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- తీవ్రంగా గాయపడి, భర్త చేతిలోనే ప్రాణాలు వదిలిన గర్భిణి
- ఎన్టీపీసీ క్రషర్‌నగర్ వద్ద ఘటన



భర్త క్రాంతితో నిహారిక (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): మాటలకందని విషాదం.. మరికొన్ని రోజుల్లో ప్రసవం జరిగి, ఆ ఇంట్లోకి శిశువు రానుందన్న వారి ఆనందాన్ని రోడ్డు ప్రమాదం క్షణాల్లో తీసుకెళ్లిపోయింది. కారు రూపంలో వచ్చిన మృత్యువు ఓ గర్భిణిని కబళించింది. భర్తతో కలిసి స్కూటీపై వెళ్తున్న ఆమెను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గర్భిణి తీవ్రంగా గాయపడి, మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన నిహారిక, రామగుండం మండలంలోని మల్యాలపల్లెకు చెందిన కత్తెర మల్ల క్రాంతి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆమె ఓ మెగా మార్కెట్‌లో పని చేస్తోంది. ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణి. ఆధార్ అప్‌డేట్ కోసం భర్తతో సోమవారం స్కూటీపై ఎన్టీపీసీ రామగుండం వచ్చింది. తిరిగి ఇంటికి



భార్యను కాపాడుకునేందుకు భర్త ఆరాటం, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

వెళ్తుండగా క్రషర్‌నగర్ రాజీవ్ రహదారిపై పెద్దపల్లి వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నిహారికను గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కడుపులో ఉన్న శిశువు కళ్లు తెరవకుండానే ప్రాణాలు విడిచింది. కొన్ని నిమిషాల్లో ఇంటికి చేరేవారని, ఈలోగా ఇంత ఘోరం జరిగిందంటూ మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రిలో కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వెళ్లి, మృతురాలి భర్త నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ..

పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్ మక్కాన్‌సింగ్ గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో నిహారిక



బాధితులను పరామర్శిస్తున్న మక్కాన్‌సింగ్

మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట నాయకులు ఫక్రుద్దీన్, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, రామగుండం పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శిరిషెట్టి సతీశ్, మడ్డి తిరుపతి గౌడ్, బరుపాటి శ్రీనివాస్ తదితరులున్నారు.

మూడు రోజులు ఫిష్ ఫెస్టివల్

- 8, 9, 10 తేదీల్లో నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: సిరిసిల్లలోని రైతుబజారులో మూడు రోజులపాటు ఫిష్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. మత్స్యశాఖ రూపొందించిన ఫిష్ ఫెస్టివల్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో ఫిష్ ఫెస్టివల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 స్టాళ్లలో నోరూరించే చేపల వంటకాలు ఉంటాయన్నారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, డీపీఆర్వో మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు పూర్తి చేయండి

సిరిసిల్ల: జిల్లాలో ఇంకుడుగుంతలు, కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణాలు పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో మాట్లాడారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా ఇంకుడుగుంతల నిర్మాణాలు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు పూర్తి చేయాలన్నారు. ఈనెల 7, 8వ తేదీల్లో సాగునీటి దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ నిర్వహించాలని సూచించారు. 7న నియోజకవర్గస్థాయిలో సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ నిర్వహించాలన్నారు. చెరువుల వద్దకు ర్యాలీగా వెళ్లాలని, కట్టమైసమ్మకు పూజలు చేసి, అక్కడే భోజనాలు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, డీఆర్వో శ్రీనివాస్‌రావు, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, డీపీవో రవీందర్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శివకుమార్, ఏపీడీ మదన్‌మోహన్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

నేడు గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

సిరిసిల్లఅర్బన్: జిల్లా గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో స్థానిక రేణుకాదేవి ఏసీ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు గోపా జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్ తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో పదోతరగతిలో 9 జీపీఏకు పైగా, ఇంటర్‌లో 950 మార్కులకు పైగా సాధించిన గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, కృష్ణప్రసాద్, నాగుల శ్రీనివాస్, నారాయణ ఉన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహప్రతిష్ఠాపన

- పాల్గొన్న ఎమ్మెల్యేలు ఈటల, రమేశ్ బాబు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చింతల్‌ఠాణా గ్రామంలోని నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, సర్పంచ్ రేగులపాటి రాణి, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, ముదిరాజ్ సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల

మోహినికుంటలో నాటు తుపాకీ కలకలం

- గ్రామశివారులో దాచిన తుపాకీ స్వాధీనం
- నిందితుల కోసం పోలీసుల గాలింపు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మోహినికుంటలో నాటుతుపాకీ కలకలం రేపింది. అధికారులను, ప్రజలను ఆందోళనకు గురిచేసిన నాటుతుపాకీ ఘటనపై ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. మోహినికుంట పిట్టలకాలనీ శివారులో ఓ గుడిసెలో నాటుతుపాకీ దాచారనే సమాచారంతో పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. కాలనీకి చెందిన ఓ యువకుడి బంధువు స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన కిషన్ ఆదివారం రాత్రి పిట్టలకాలనీకి చేరుకున్నాడు. మద్యం సేవించిన కిషన్ అల్లుడు ఇతర బంధువులతో ఘర్షణకు దిగాడు. వారి మధ్య వాదోపవాదాలు జరుగగా.. సంచిలో దాచిన తుపాకీని విసిరిగొట్టాడు. దీంతో అక్కడున్న వారు భయాందోళనకు గురై దానిని శివారులోని ఓ షెడ్డులో దాచిపెట్టారు. తుపాకీని విసిరికొట్టిన కిషన్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయం ఉదయం పోలీసులకు తెలియడంతో తుపాకీని స్వాధీనం చేసుకుని కిషన్ అల్లుడిని అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు జిల్లాలో చేపల చెరువు వద్ద కాపలాదారుడిగా పనిచేసిన కిషన్.. కూతురును చూసేందుకు మోహినికుంటకు వచ్చాడు. పిట్టలను కొట్టేందుకు కిషన్ నాటు తుపాకీ వాడారు. కిషన్ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎస్పీ అఖిల్ మహాజన్
- సిరిసిల్లలో పోలీస్‌శాఖ సైకిల్ ర్యాలీ

సిరిసిల్లక్రైం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా ప్రజలకు ప్రకృతి సహజ రక్షణ గురించి తెలిసేలా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రగుడుచౌరస్తా నుంచి పాతబస్టాండ్, అంబేడ్కర్‌చౌక్, గోపాల్‌నగర్‌చౌరస్తా, గాంధీచౌక్ మీదుగా బతుకమ్మఘాట్ వరకు సైకిల్ ర్యాలీలో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పచ్చదనం ఉన్న ప్రాంతంలోనే ఆహ్లాదకర వాతావరణం ఉంటుందన్నారు. జీవకోటికి మొక్కలే ప్రధానమన్నారు. ఆరోగ్యం కోసం యోగా, ఎక్సర్‌సైజ్ చేయాలన్నారు. బతుకమ్మ ఘాట్ వద్ద యువకులతో కలసి మొక్కలు నాటారు. చిన్నారులతో సెల్ఫీ దిగారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, రవికుమార్ పాల్గొన్నారు.

సత్వర న్యాయానికి గ్రీవెన్స్ డే

సిరిసిల్లక్రైం: బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సత్వర న్యాయం అందించేందుకు ప్రతీ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 20 మంది నుంచి అర్జీలు స్వీకరించి.. ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్‌చేసి పరిష్కరించాలని ఆదేశించారు. భూతగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్టప్రకారం నడుచుకుంటూ బాధితులకు న్యాయం అందేలా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థంగా సేవలందిస్తామన్నారు.



సైకిల్ ర్యాలీలో ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీసులు

హరితహారం చెట్లను నరికిన వ్యక్తికి జరిమానా



జరిమానా విధిస్తున్న అధికారి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): హరితహారంలో భాగంగా నాటిన చెట్లను నరికివేసిన వ్యక్తికి గ్రామ పంచాయతీ అధికారులు సోమవారం రూ.వెయ్యి జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే..మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన బాలయ్య అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి మండల కేంద్రంలో నూతన భవనం నిర్మిస్తున్నాడు. తన భవన నిర్మాణానికి సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై హరితహారంలో నాటిన చెట్లు అడ్డుగా ఉన ఉన్నాయని ఆదివారం రాత్రి నరికివేశాడు. పంచాయతీ అధికారులు విచారణ చేసి అనుమతులు లేకుండా చెట్లను నరికిన బాలయ్యకు రూ. వెయ్యి జరిమానా విధించారు. చెట్లను అక్రమంగా నరికివేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఈవో దేవరాజు తెలిపారు.

నేటినుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

చందుర్తి : మండలంలోని మూడపల్లిలో స్వయంభూ శ్రీ పద్మావతి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చిలుక అంజిబాబు తెలిపారు. 6న స్వామివారి నిత్య ఆరాధన, సేవాకాలం ఉత్సవాలు ప్రారంభం, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగహనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, విష్ణు సహస్ర నామ పారాయణం, ద్వారాతోరణం, ధ్వజ కుంభారాధన, దేవతాహ్వానం, నిత్య పూర్ణహుతి, నివేదన, 7న స్వామివారి కల్యాణం, 8న నాగెల్లి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని సర్పంచ్ పేర్కొన్నారు.

విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

సిరిసిల్ల: విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను సోమవారం జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ తనిఖీ చేశారు. విత్తనాల డీలర్ల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు ఉన్నారు.

స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్‌లో ప్రతిభ

సిరిసిల్లఎడ్యుకేషన్ : జిల్లా విద్యార్థులు మరోమారు స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ ప్రోగ్రాంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు. స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ 2022 పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 13,700 మంది పోటీపడగా జిల్లా నుంచి 391 మంది పోటీల్లో నిలిచినట్లు జిల్లా సైన్స్ అధికారి దేవయ్య సోమవారం తెలిపారు. అత్యుత్తమమైన 70 ఇన్నోవేషన్స్‌ను రాష్ట్రస్థాయి బూట్ క్యాంప్, గ్రాండ్ ఫినాలేకు ఎంపిక చేశారు. ఈ ప్రదర్శనలో గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులు సుప్రియ, శ్రీచైత్ర, ఎం. రాంచరణ్, డి.ప్రణయ్‌కుమార్ ×వంట మిత్ర పేరిట తయారు చేసిన పరికరం, ఎల్లారెడ్డిపేట మండలం జెడ్పీ పాఠశాల అల్మాస్‌పూర్ విద్యార్థులు డి.రేఖ, టి.హరివర్ధన్, సహస్ర, స్పందన ×రైతులకు ఉపయోగపడే గొడుకు, మల్టీపర్పస్ బ్యాగ్ ప్రదర్శనలు ఎంపికైన వాటిలో ఉన్నాయి. హైదరాబాద్‌లో ఈనెల 20 నుంచి 22 వరకు జరిగే గ్రాండ్ ఫినాలేలో రెండు పాఠశాలల విద్యార్థులు పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను డీఈఓ రమేశ్, జిల్లా సైన్స్ ఆఫీసర్ దేవయ్య అభినందించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మద్దికుంట లక్ష్మణ్, బోయన్నగారి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారుచేసిన పరికరం

'సంక్షేమ పథకాలు పేదలకు అందడం లేదు'

ఇల్లంతకుంట(మానకొండూర్): తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ సర్కారు పాలనలో పేద ప్రజలు సంక్షేమ పథకాలు అందడం లేదని, కేసీఆర్ కుటుంబం మాత్రం వేలాది కోట్లు పోగేసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని సోమారంపేట గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళితబంధు పేరుతో సీఎం కేసీఆర్ దళితులను మరోసారి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. నిరుపేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కలగానే మిగిలిపోతున్నాయని, ఇంటిస్థలం ఉన్న వారికి రూ.3లక్షలు ఎప్పుడిస్తారో తెలియదన్నారు. రైతు రుణమాఫీ చేస్తామన్న సీఎం కేసీఆర్ మాటలు వట్టి నీటి మూటలుగానే మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం కేసీఆర్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. పేదలకు త్వరలోనే మంచిరోజులు రానున్నాని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వస్తుందని పేర్కొన్నారు. మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల వెంకటి, సురేందర్ రెడ్డి, సాగర్ తదితరులున్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న కవ్వంపల్లి

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

రుద్రంగి (వేములవాడ): విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇన్‌చార్జ్ సెస్ ఏఈ రాకేశ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగిలో ఆదివారం సాయంత్రం కురిసిన ఈదురు గాలుల వర్షానికి నాగారం చెరువు ఆవరణలోని పంటపొలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేస్తుండగా మరో ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అవుతున్న వైర్లను తగలడంతో జూనియర్ లైన్‌మెన్ ఫూల్‌సింగ్‌కు విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. తీవ్రగాయాలైన ఫూల్‌సింగ్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉపాధ్యాయులకు ఏడేళ్లుగా బదిలీలు లేవని ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ అన్నారు. సోమవారం కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీ లేకపోవడంతో ప్రభుత్వ విద్యారంగం గాడితప్పిందన్నారు. 2018 జూలై నుంచి అమల్లోకి వచ్చిన పీఆర్సీ గడువు ఈనెలతో ముగుస్తుందని, జూలై 1 నుంచి కొత్త పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని యజమాన్యాల గురుకుల ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సు ఈనెల 7న యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయం హైదరాబాదులో జరుగుతుందని, కార్యక్రమానికి జిల్లాలోని అన్ని గురుకులాల ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రమేశ్, జిల్లా కోశాధికారి పర్కాల రవీందర్, జిల్లా కార్యదర్శులు పొలాస మల్లేశం, అడెపు శివకుమార్, జంగిటి రాజు, కొత్వాల్ ప్రవీణ్, వంగ మల్లేశం, తిరుపతి జాదవ్, పాముల స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, వసతుల కల్పన, ఉచిత పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. సోమవారం పట్టణంలోని వెంకంపేట పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఏ రమేశ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్లూరి రాజు పాఠశాల ఎస్ఎంసీ చైర్ పర్సన్ వీరబత్తిని కమలాకర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొలాస మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో..

బడిబాటలో భాగంగా నెహ్రూనగర్‌లో ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఎస్ఎంసీ చైర్మన్ నరేశ్, సభ్యులు మేరుగు రేఖ, ఉపాధ్యాయులు లచ్చయ్య, పరమేశ్, రాజశేఖర్, శ్రీనివాసరావు, అబ్దుల్ కుదూస్,అడుప కీర్తి, సువర్ణ, రజిత, తదితరులు పాల్గొన్నారు.



బడిబాటలో పాల్గొన్న డీఈవో రమేశ్‌కుమార్

ఆదర్శంగా వేములవాడ సింగిల్‌విండో

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగరెడ్డి

వేములవాడఅర్బన్: రాష్ట్రంలో వేములవాడ సింగిల్ విండో ఆదర్శంగా ఉందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగరెడ్డి అన్నారు. పట్టణంలోని వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రైతుల కోసం సింగిల్‌విండో, మార్క్‌ఫెడ్ సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం కొనుగోలుపై అధికారుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం వేములవాడ పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, కిషన్‌రెడ్డి, రాం మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, సీఈవో లక్ష్మణ్, తదితరులున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వేములవాడ : రాజన్న ఆలయ అనుబంధ దేవాలయమైన వేణుగోపాల స్వామివారి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం ద్రావిడ పారాయణం, నీరాజనం, మంత్రపూర్ణం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ఈనెల 9న స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే కల్యాణోత్సవం ఈనెల 9న ఏకాంత సేవతో ముగుస్తాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఈవో కృష్ణప్రసాద్ కోరారు.



పూజలు చేస్తున్న అర్చకులు